సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 5 । డిసెంబర్ । 2024



డ్రైయినేజీ సమస్యకు చెక్

జిల్లా సర్వజన ఆస్పత్రిని పట్టిపీడిస్తున్న డ్రైయినేజీ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా ఎట్టకేలకు పరిష్కారం లభించింది. 8లో



ఆత్మస్థైర్యంతో రాణించాలి

దివ్యాంగులు ఏ రంగంలో అయినా ఆత్మస్థైర్యం, పట్టుదలతో రాణించాలని అదనపు కలెక్టర్ విద్యాచందన సూచించారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 31° / 22°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఒకటి, రెండు చోట్ల చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు స్నపన తిరుమంజనం

ఆలయంలో కొనసాగుతున్న ప్రజాపాలన వేడుకలు



ఆలయ ప్రాంగణంలో కుటుంబ సభ్యులతో రోహిత్‌రాజ్

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి బుధవారం వైభవంగా స్నపన తిరుమంజనం జరిపారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. అనంతరం స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, ప్రజా పాలన దినోత్సవ వేడుకలు దేవస్థానం ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఈఓ రమాదేవి గోపూజ చేసి, యాగశాలలో జరిగిన సుదర్శన హోమంలో పాల్గొన్నారు. అర్చకులు సువర్ణ పుష్పార్చన, సహస్ర నామార్చన, శ్రీరామ తారక మంత్ర సంపుటిత సంక్షేప రామాయణ హవనం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం చిత్రకూట మండపంలో సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.

రామయ్యను దర్శించుకున్న ఎస్పీ

శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని ఎస్పీ రోహిత్‌రాజ్ కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ అనంతరం అంతరాలయంలో మూలమూర్తుల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఉపాలయాలను దర్శించుకున్న తర్వాత పండితులు లక్ష్మీతాయారు అమ్మవారి సన్నిధిలో వేదాశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈఓ రమాదేవి, సీఐ సంజీవరావు, ఎస్సైలు బీవీఎస్ రావు, విజయలక్ష్మి, ట్రాఫిక్ ఎస్సై మధు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహనకు కరదీపిక దోహదం



పుస్తకాలను విడుదల చేస్తున్న డీఎంహెచ్‌ఓ తదితరులు

కొత్తగూడెంరూరల్ : ప్రజలకు ఆరోగ్య కార్యక్రమాలపై అవగాహన కల్పించేలా కరదీపిక ఉపయోగపడుతుందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్.భాస్కర్‌నాయక్ అన్నారు. తన కార్యాలయంలో బుధవారం ప్రజారోగ్యం – కుటుంబ సంక్షేమంపై ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు ఉపయోగపడే కరదీపికను విడుదల చేశారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. గ్రామాల్లో పనిచేసే ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లకు దీనివల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, ప్రోగ్రామ్ అధికారి బాలాజీనాయక్, డాక్టర్లు స్పందన, కళ్యాణ్, మహ్మద్ ఫైజ్ మొహిద్దీన్ పాల్గొన్నారు.

ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ప్రారంభం




డిస్పెన్సరీని ప్రారంభిస్తున్న ప్రాంతీయ డైరెక్టర్ గౌమింతంగ్

ఖమ్మంవైద్యవిభాగం: ఉమ్మడి జిల్లాలోని ఈఎస్‌ఐ లబ్ధిదారుల సౌకర్యార్థం ఖమ్మం రాపర్తినగర్‌లోని బీఎస్‌ఎన్‌ఎల్ భవన ప్రాంగణంలో డిస్పెన్సరీ, బ్రాంచ్ కార్యాలయాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యాలయాన్ని ఈఎస్‌ఐ తెలంగాణ ప్రాంతీయ డైరెక్టర్ గౌమింతంగ్ గాంగ్టే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం, ప్రసూతి, వృత్తిపరమైన ప్రమాదాలు, శాశ్వత వైకల్యం బారిన పడినవారే కాక డిపెండెంట్ ప్రయోజనాలను ఈ కార్యాలయం ద్వారా పొందొచ్చని తెలిపారు. బీఎస్‌ఎన్‌ఎల్ డీజీఎం డి.శ్రీనివాసరావు, ఈఎస్‌ఐ డిప్యూటీ డైరెక్టర్లు మహేష్ నాదల, మారేంరెడ్డి వినయ్, వేదప్రకాష్, సూపరింటెండెంట్ డి.రఘునాథ, బ్రాంచ్ మేనేజర్ జి.సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మో.. ఏం జరిగింది?

మణుగూరు నుంచి మొదలు

ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం ఐలాపూర్ కేంద్రంగా భూంకంపం సంభవించింది. భూమికి 40 కి.మీ. లోతులో రిక్టర్ స్కేల్‌పై 5.3 తీవ్రతతో భూకంపం వచ్చింది. దీంతో ఐలాపూర్ నుంచి మొదలైన ప్రకంపనాల ప్రభావం మణుగూరు పరిసర ప్రాంతాల మీదుగా జిల్లా అంతటా వ్యాపించింది. కొంత మంది మూడు నాలుగు సెకన్ల పాటు ప్రకంపనాలు వచ్చినట్టు చెప్పగా మరికొందరు మూడు నుంచి ఏడు సెకన్ల పాటు తాము భూమి కదలడాన్ని గమనించామని అంటున్నారు. ఎక్కువ మంది ఇంటి గోడలు కంపిస్తున్న శబ్దం విని.. ఇంటిపై కోతుల దాడితో వెలువడిన చప్పుడుగా పొరబడ్డారు. మరి కొందరు తమకున్న అనారోగ్య సమస్యల కారణంగా కళ్లు తిరిగాయని భావించారు.



ఇల్లెందులోని 21 పిట్ ఏరియాలో ఇంటి గోడకు ఏర్పడిన పగుళ్లు

భూకంపంతో ఉలిక్కిపడిన జిల్లా వాసులు

- మూడు నుంచి ఏడు సెకన్ల పాటు కంపించిన భూమి
- ఎక్కువ లోతులో రావడంతో తప్పిన నష్టం
- గతంలోనూ జిల్లాలో పలుమార్లు భూ ప్రకంపనలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో బుధవారం సంభవించిన భూకంపంతో ప్రజలంతా ఉలిక్కిపడ్డారు. ఉదయాన్నే పనుల్లో ఉన్న గృహిణులు, స్కూళ్లకు వెళ్లేందుకు సిద్ధవుతున్న విద్యార్థులు, డ్యూటీలకు వెళ్లేవారు, వివిధ వాణిజ్య పనుల్లో నిమగ్నమైన వారు.. కాళ్ల కింద కంపించిపోతున్న నేలను చూసి కాసేపు కంగారు పడ్డారు. కానీ కొన్ని నిమిషాల వ్యవధిలోనే భూకంపం వచ్చిందంటూ వార్తలు రావడం, ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టులు హోరెత్తడంతో అందరికీ ఓ స్పష్టత వచ్చింది. దీంతో ఇళ్లలో నుంచి బయటకు వచ్చి పొరుగువారితో తమ అనుభవాలను పంచుకున్నారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న వారు ఇక్కడి ప్రజల క్షేమ సమాచారాన్ని ఫోన్ల ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఉదయం 7:30 గంటల నుంచి మొదలైన భూకంప చర్చ 10 గంటల వరకు జోరుగా సాగింది. ఆ తర్వాత ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు. భూకంపం కారణంగా జిల్లా వ్యాప్తంగా కొందరి ఇళ్లకు బీటలు వారగా, కొన్ని చోట్ల ఇంట్లో అమర్చిన సామగ్రి కిందపడిపోయాయి. ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం సంభవించలేదు.

లోతెక్కువ కావడంతో..

భూమి లోపలి పొరల్లో జరిగే ఘర్షణల కారణంగా భూకంపాలు తరచుగా సంభవిస్తుంటాయి. గత ఏడాది కాలంలో యూరేషియన్ ప్లేట్ పరిధిలో 156 సార్లకు పైగా భూకంపాలు వచ్చాయి. అయితే ఇందులో ఎక్కువ సార్లు రిక్టర్ స్కేలుపై మూడు పాయింట్లలోపే నమోదు కావడంతో ఆ కంపనాల తాలూకూ అనుభూతి ప్రజలకు తెలిసే అవకాశం తక్కువ. కాగా, బుధవారం సంభవించిన భూకంపం ఈ ఏడాదిలో ఇప్పటివరకు దేశంలో వచ్చిన అతి పెద్దదిగా రికార్డయింది. రిక్టర్ స్కేలుపై ప్రమాదకర స్థాయిలో 5.3గా నమోదైంది. అయితే భూమి లోపల 40 కి.మీ. లోతులో భూకంప కేంద్రం ఉండటంతో ప్రమాద తీవ్రత తగ్గినట్టు చెబుతున్నారు. ఇదే 30 కి.మీ. లోతులో ఉంటే ఆస్తి నష్టం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉండేవని నిపుణులు అంటున్నారు.

జిల్లాలో ఇప్పటివరకు..

గోదావరి పరీవాహక ప్రాంతమైన జిల్లాలో ఇప్పటి వరకు పలుమార్లు భూప్రకంపనలు సంభవించాయి. అయితే తీవ్రత ఎక్కువగా ఉన్న వాటిలో 1954లో 4.3, 1969లో భద్రాచలంలో రిక్టర్ స్కేల్‌పై 6గా నమోదైంది. ఇక కొత్త మిలీనియంలో 2004లో ఒకసారి భూకంపం వచ్చింది. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత 2018 ఆగస్టు 14న జిల్లాలోని మణుగూరు, కొత్తగూడెం ఏరియాల్లో రాత్రి వేళ కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. ఆ తర్వాత 2023 ఆగస్టు 25 తెల్లవారుజామున మణుగూరులో భూమి కంపించిన అనుభూతిని ప్రజలు పొందారు. అయితే ఈ మూడు సందర్భాల్లో ఎక్కువ మంది భూమి కంపించడాన్ని గమనించలేకపోయారు. కానీ బుధవారం వచ్చిన భూకంపనాలు మాత్రం నిద్రలో ఉన్న వారికి మెలకువ వచ్చే స్థాయిలో ఉండటంతో అందరికి గుర్తుండిపోయేలా మారింది.

జిల్లాలో భూకంప వివరాలు

తేదీ	తీవ్రత	సమయం
14 ఆగస్టు 2018	--	9:10 పీఎం
25 ఆగస్టు 2023	3.5	4:45 ఏఎం
04 డిసెంబర్ 2024	5.3	7:27 ఏఎం

‘పెదవాగు’కు ప్రతిపాదనలు సిద్ధం



పెదవాగు ప్రాజెక్టు ఆనకట్టకు పడిన భారీ గండి(ఫైల్)

- రీ డిజైన్‌కే నీటి పారుదల శాఖ మొగ్గు
- అదనంగా ఐదు క్రస్ట్‌గేట్లకు సిఫారసు
- ఆధునికీకరణకు రూ.80 కోట్లతో అంచనాలు

అశ్వారావుపేటరూరల్: జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్ట్‌గా పేరుగాంచిన పెదవాగు ఆధునికీకరణకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. పాలనాపరంగా అనుమతి లభిస్తే ప్రాజెక్టుకు త్వరలోనే పూర్వ వైభవం రానుంది. మండలంలోని గుమ్మడవల్లి సమీపంలో గల పెదవాగు ప్రాజెక్టుకు ఈ ఏడాది జూలై 18న కురిసిన భారీ వర్షాలతో వరదనీరు ఒక్కసారిగా పోటెత్తింది. దీంతో ప్రధాన ఆనకట్టకు భారీ గండ్లు పడగా ప్రస్తుతం ఆధునికీకరించాల్సి వస్తోంది. ప్రాజెక్టు కింద అశ్వారావుపేటతో పాటు ఏపీలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో 16 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. భారీ వర్షాలు, వరదలతో ప్రాజెక్టు ఆనకట్టకు భారీ గండ్లు పడిన నేపథ్యంలో ఖరీఫ్ సీజన్‌లో రైతులు నష్టపోవద్దని, ఆయకట్టు పంటలకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే కృషి చేశారు. రింగ్‌బండ్ నిర్మాణానికి రూ.3.50 కోట్లు మంజూరు చేయించగా, అనేక అడ్డంకుల నడుమ ఎట్టకేలకు రెండు నెలల క్రితమే రింగ్‌బండ్(మట్టి కట్ట) పనులు పూర్తి చేసి సాగునీరు అందించారు. వచ్చే వేసవి నుంచి శాశ్వత నిర్మాణ పనులు చేయిస్తామని రాష్ట్ర మంత్రులు హామీ ఇచ్చారు.

రీ డిజైనే మేలు..

పెదవాగు ప్రాజెక్టు ప్రస్తుతం మూడు క్రస్ట్‌గేట్లతో, 19.3 అడుగుల ఎత్తుతో ఉంది. భారీ వరదల సమయంలో ప్రాజెక్టులోకి దాదాపు 40 వేల క్యూసెక్కుల వరదనీరు వచ్చినా తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంది. కాగా, ఈ ఏడాది భారీ వర్షాలతో దాదాపు 80 వేల క్యూసెక్కుల వరద నీరు ఒక్కసారే పోటెత్తడంతో ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టకు 250 మీటర్ల మేర గండ్లుపడి కొట్టుకుపోయిందని నీటి పారుదలశాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు భవిష్యత్‌ను అంచనా వేస్తూ పెదవాగు ప్రాజెక్టును పూర్తిగా రీడిజైన్ చేస్తేనే ప్రయోజనం ఉంటుందని భావిస్తున్నారు. రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. రీ డిజైన్‌లో భాగంగా ఇప్పుడున్న మూడు క్రస్ట్ గేట్లకు అదనంగా మరో ఐదు క్రస్ట్ గేట్లను ఏర్పాటు చేసేలా అంచనాలు సిద్ధం చేశారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని కూడా 40 వేల క్యూసెక్కుల నుంచి లక్ష క్యూసెక్కులకు పెంచేలా అంచనాలు రూపొందించారు. నీటి నిల్వ సామర్థ్యం పెరిగితే అశ్వారావుపేట మండలంలోనే ఆయకట్టు విస్తీర్ణం పెరగనుంది. కాగా, రీ డిజైన్‌కు సుమారు రూ.80 కోట్ల వ్యయం అవుతుందని తేల్చారు. ఇది ఆలస్యమైతే ప్రధాన ఆనకట్ట పునర్నిర్మాణానికి రూ.12 కోట్లు అవసరమని గుర్తించారు. ఈ రెండు ప్రతిపాదనలు జిల్లా ఉన్నతాధికారుల నుంచి సీఎంఓకు వెళ్లాల్సి ఉంది.

అనుమతి వస్తే మహర్దశే..

రీ డిజైన్‌కు ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే రానున్న రోజుల్లో పెదవాగు ప్రాజెక్ట్‌కు మహర్దశ పట్టడం ఖాయం. మరి ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందోనని రైతులు వేచిచూస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ గోదావరి బేసిన్ బోర్డు పరిధిలో ఉండడంతో నిబంధనల ప్రకారం తెలంగాణ, ఏపీ రాష్ట్రాల నుంచి నిధులు రావాల్సి ఉంటుంది. కానీ ప్రాజెక్టు గండి, మరమ్మతులు, రీడిజైన్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేదు. దీనిపై స్థానిక ఇరిగేషన్ డీఈఈ కృష్ణను వివరణ కోరగా.. ప్రతిపాదనలు పూర్తి చేశామని, ప్రాజెక్టు శాశ్వత పరిష్కారం, భవిష్యత్ అవసరాలకు తగ్గట్టుగా రీడిజైన్‌కు సిఫార్సు చేశామని తెలిపారు.

బుగ్గపాడులో సిద్ధమైన ఫుడ్‌పార్క్

నేడు ప్రారంభించనున్న మంత్రులు

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మండలం బుగ్గపాడులో ఫుడ్‌పార్కు ప్రారంభోత్సవానికి ముస్తాబైంది. ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు శ్రీధర్‌రాబాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి గురువారం ఈ పార్కును ప్రారంభిస్తారని అధికారులు వెల్లడించారు. ఇందులో భాగంగా కల్లూరు ఆర్డీఓ రాజేంద్ర గౌడ్ పర్యవేక్షణలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయల సంస్థ అధికారులు సభావేదిక, ఇతర ఏర్పాట్లు చేశారు.



సిద్ధమైన సభావేదిక వద్ద అధికారులు

టీజీఎఫ్‌డీసీ భవన సముదాయాలు ప్రారంభం

హాజరైన కలెక్టర్ పాటిల్, ఎమ్మెల్యే కూనంనేని

చుంచుపల్లి: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా కొత్తగూడెంలోని తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ(టీజీఎఫ్‌డీసీ) నూతన భవన సముదాయాలతో పాటు కొత్తగా నిర్మించిన బీట్ ఆఫీసర్స్ క్వార్టర్లను హైదరాబాద్ బొటానికల్ గార్డెన్స్ నుంచి బుధవారం వర్చువల్ పద్ధతిలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. దానికి అనుగుణంగా కొత్తగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, కలెక్టర్ జితేష్ వి.పాటిల్, జిల్లా అటవీ శాఖ అధికారి కిష్టాగౌడ్, టీజీఎఫ్‌డీసీ కొత్తగూడెం డివిజన్ మేనేజర్ జి.చంద్రమోహన్, ఎఫ్‌డీఓ కోటేశ్వరరావు, ఎఫ్‌ఆర్‌ఓ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



భవన సముదాయాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ పాటిల్ తదితరులు

గిరిజన విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి

భద్రాచలం: గిరిజన సంక్షేమ శాఖ పరిధి పాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్యాలను ప్రాథమిక దశలోనే పటిష్టం చేసేలా ఉపాధ్యాయులు చొరవ చూపాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. భద్రాచలంలోని బీఈడీ కళాశాలలో బుధవారం ఉద్దీపకం వర్క్ బుక్స్‌పై ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన శిక్షణను ఆయన ప్రారంభించి వేదిక్ గణితం బుక్‌లెట్లను ఆవిష్కరించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టిన నేపథ్యాన ప్రత్యేకంగా ఉద్దీపకం వర్క్ బుక్స్ రూపొందించామని, వీటి ఆధారంగా విద్యార్థులు గణితంలో పట్టు సాధించేలా బోధించాలని తెలిపారు. అరవై రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజూ నాలుగు గంటల పాటు పిల్లలతో ఇంగ్లిష్, గణితం సాధన చేయించాలని, ఈ విషయంలో అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ఎస్సెస్సీ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా వంద రోజుల ప్రణాళిక అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీలు మణెమ్మ, విజయలక్ష్మి, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరూనాయక్, అధికారులు రమణయ్య, శ్రీరాములు, జహీరుద్దీన్, చంద్రమోహన్, అశోక్‌కుమార్, సత్యవతి, రాధమ్మ, రఘునందన్‌సింగ్, శంకర్, రాంబాబు, మోతీలాల్, అలివేలు మంగతాయారు తదితరులు పాల్గొన్నారు.



బుక్‌లెట్లు ఆవిష్కరిస్తున్న పీఓ రాహుల్, అధికారులు

ఉపాధ్యాయుడికి అభినందన

భద్రాచలంటౌన్ : విద్యార్థుల్లో నైపుణ్యం పెంచడంతో పాటు అడిగిన ప్రతి ప్రశ్నకు భయపడకుండా సమాధానం చెప్పేలా ప్రత్యేక శ్రద్ధతో విద్యాబోధన చేసిన ఉపాధ్యాయుడు రమేష్‌ను పీఓ రాహుల్ బుధవారం అభినందించారు. ఉద్దీపకం వర్క్ బుక్ ఇంగ్లిష్ మీడియం ఒకరోజు ట్రైనింగ్‌లో భాగంగా ఉపాధ్యాయులకు రమేష్ శిక్షణ అందించారు.

95 పాఠశాలల్లో ‘సర్వే’ పరీక్ష

‘పరఖ్ – రాష్ట్రీయ సర్వేక్షణ్’ సక్సెస్

కొత్తగూడెంఅర్బన్: పరఖ్ రాష్ట్రీయ సర్వేక్షణ్‌లో భాగంగా బుధవారం జిల్లాలోని 95 పాఠశాలల్లో 111 సెక్షన్లకు సంబంధించి 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన జాతీయ సాధన సర్వే పరీక్ష విజయవంతమైంది. ఈ పరీక్షకు 2,807 మంది విద్యార్థులకు గాను 2,598 మంది హాజరయ్యారు. వీరిలో మూడో తరగతికి సంబంధించి 815 మందికి గాను 767 మంది, ఆరో తరగతిలో 869 మందికి గాను 792 మంది, 9వ తరగతిలో 1,123 మందికి గాను 1,039 మంది విద్యార్థులు హాజరు కాగా 372 మంది ఉపాధ్యాయులు కూడా వారికి సంబంధించిన ప్రశ్న పత్రాలను పూరించి సర్వేలో పాల్గొన్నారని డీఈఓ వెంకటేశ్వరాచారి తెలిపారు. ఈ సర్వే కోసం సీబీఎస్‌ఈ నుంచి 95 మంది పరిశీలకులు, ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లుగా 165 మంది బీఈడీ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. డీఈఓ పాల్వంచ మండలం కొమ్ముగూడెం పాఠశాలను సందర్శించి ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ పాల్వంచ లోని రెజీనా కాన్వెంట్, కేజీబీవీ, సరస్వతీ శిశు మందిర్, జెడ్పీ బాలికోన్నత పాఠశాల కేంద్రాలను సందర్శించారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న నాగరాజశేఖర్

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ధాన్యం కొనుగోళ్లు సజావుగా సాగాలి
- అధికారులకు కలెక్టర్ ఆదేశం

సుజాతనగర్: రైతులను ఏ మాత్రం ఇబ్బంది పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. సుజాతనగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబెట్టిన రైతులతో మాట్లాడారు. తేమ శాతం 17 లోపు వచ్చాకే ధాన్యాన్ని తూర్పార బట్టాలని అన్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు. రైతులు మునగ సాగు, చేపల పెంపకంపై దృష్టి సారించాలని అన్నారు. వరి ధాన్యం బోనస్‌పై ఎలాంటి అపోహలు వద్దని, రైతుల ఖాతాల్లో బోనస్ నగదు జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి త్రినాథ్‌బాబు, తహసీల్దార్ జి.శిరీష, ఎంపీడీఓ బి.భారతి, ఏఓ జి.నర్మద, ఏఈఓలు శరత్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల జాబితా నోటీస్‌బోర్డులో ఉంచాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారుల జాబితాను గురువారం సాయంత్రం వరకు అన్ని తహసీల్దార్, గ్రామపంచాయతీ కార్యాలయాల నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపిక, సమగ్ర సర్వే డేటా ఎంట్రీ ప్రక్రియపై అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్‌తో కలిసి బుధవారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అన్ని గ్రామాల్లో డేటా ఎంట్రీ ప్రక్రియ పూర్తి చేయాలని, పూర్తయిన మండలాల వారు పూర్తికాని వారికి సాయం చేయాలని చెప్పారు. పాల్వంచలో డేటా ఎంట్రీ పూర్తయిన వెంటనే ములకలపల్లి డేటా ఎంట్రీ ప్రక్రియకు సహాయం అందించాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. డబుల్ ఇళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. అర్హులైన వారి దరఖాస్తులను నిర్దేశిత ఫార్మాట్ ద్వారా పూర్తి చేయాలని, దరఖాస్తుతో పాటు దరఖాస్తుదారులు ఫొటో, ప్రస్తుతం నివాసం ఉంటున్న గృహం ఫొటో పొందుపర్చాలని సూచించారు. గ్రామ సభల్లో వచ్చిన అభ్యంతరాలపై విచారణ చేపట్టి నివేదికలు అందజేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అధికారులకు సూచించారు.



ధాన్యంలో తేమను పరిశీలిస్తున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

ప్రశాంతంగా రైల్వే యూనియన్ ఎన్నికలు

కొత్తగూడెంఅర్బన్: రైల్వే శాఖలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు భద్రాచలం రోడ్డు రైల్వే స్టేషన్‌లో బుధవారం జరిగాయి. ఐదేళ్లకోసారి చొప్పున 2019లో జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడుతూ.. ఇప్పుడు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో దక్షిణ మధ్య రైల్వే కార్మిక సంఘం, రైల్వే మజ్దూర్ యూనియన్, ఇండియన్ రైల్వే మజ్దూర్ యూనియన్, సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్, సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్లు పోటీలో ఉన్నాయి. స్థానిక స్టేషన్ పరిధిలో 851 మంది కార్మికులు, ఉద్యోగులకు ఓటు హక్కు ఉండగా మొదటి రోజు 350 ఓట్లు పోలయ్యాయి. గురు, శుక్రవారాల్లోనూ ఎన్నికలు జరగనుండగా.. మొదటి రోజు ఓటు హక్కు వినియోగించుకోలేని వారు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఎన్నికల ఫలితాలు ఈనెల 12న ఫలితాలు వెల్లడించనున్నారు.



ఓటు వేసేందుకు క్యూలో ఉన్న కార్మికులు, ఉద్యోగులు

క్లుప్తంగా

క్రీడాపోటీలకు సహకరించండి..


పీఈటీలతో అసిస్టెంట్ కమాండెంట్ రేవతి

దుమ్ముగూడెం: మండలం పరిధి లక్ష్మీనగరంలోని సీఆర్పీఎఫ్ క్యాంపులో మండలంలోని పీఈటీలతో అసిస్టెంట్ కమాండెంట్ రేవతి అర్జున్ బుధవారం సమావేశమయ్యారు. వచ్చే నెల సీఆర్పీఎఫ్ ఆధ్వర్యాన వాలీబాల్, కబడ్డీ, ఖో–ఖో, బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించనుండగా ఏర్పాట్లపై చర్చించిన ఆమె సహకరించాలని సూచించారు. మైదానాల ఎంపిక, క్రీడాకారులకు కల్పించాల్సిన సౌకర్యాలపై పీఈటీలతో సమీక్షించారు.

14న జాతీయ లోక్ అదాలత్

కొత్తగూడెంఅర్బన్: జిల్లా కోర్టులో ఈ నెల 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బత్తుల రామారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ ద్వారా కేసులు పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు.

నేత్రదానం

భద్రాచలంటౌన్: పట్టణంలోని ముదిరాజ్ బజార్‌కు చెందిన కుర్రు శ్రీను (44) గుండెపోటుతో బుధవారం మృతి చెందాడు. కాగా మృతుడి కళ్లను అతని తల్లి తిరుపతమ్మ దానం చేసింది. ఈ మేరకు డాక్టర్ అగర్వాల్ ఐ బ్యాంక్ ఇన్‌చార్జ్ జానీ వివరాలు వెల్లడించారు.

పరస్పరం దాడులు

దమ్మపేట: ఇంటి సరిహద్దు తగాదా కారణంగా రెండు కుటుంబాలు పరస్పరం దాడి చేసుకుని, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం... మండల పరిధిలోని నాగుపల్లి గ్రామానికి చెందిన గుడా ముత్యాలరావుకు అదే గ్రామానికి చెందిన చీకటి వెంకయ్యకు మధ్య కొంతకాలంగా ఇంటి సరిహద్దు తగాదా ఉంది. ఈ క్రమంలో మంగళవారం రాత్రి వారి మధ్య ఘర్షణ జరిగి పరస్పరం భౌతిక దాడులు చేసుకున్నారు. ముత్యాలరావు తండ్రి దేవయ్యకు కంటి సమీపంలో స్వల్పంగా దెబ్బతగిలి రక్తస్రావం కాగా, చీకటి వెంకయ్య మద్దతుదారులకు స్వల్పంగా దెబ్బలు తగిలాయి. ఇరువర్గాలు ఫిర్యాదు చేశాయని, కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపడతామని ఎస్సై సాయికిషోర్ రెడ్డి తెలిపారు.

చర్యలు తీసుకోండి

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలంలోని శ్రీరామచంద్ర ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో టేకు చెట్లను నరికి మాయం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఇటీవల కలెక్టర్ క్రీడల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించారు. అభివృద్ధి పనులలో భాగంగా కాలేజీలో ఉన్న కొన్ని చెట్లను మిషన్‌తో కట్ చేయించారు. ఇదే అదునుగా భావించిన కొందరు టేకు చెట్లను కూడా నరికి ముక్కలుగా చేసి గుర్తు తెలియని వాహనంలో రాత్రి సమయంలో తరలించినట్టు స్థానికులు చెబుతున్నారు. నరికిన చెట్ల వేర్లు కనపడకుండా చెత్తాచెదారం వేసి నిప్పంటించారు. ఈ వ్యవహారాన్ని అటవీ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అటవీశాఖ ఉన్నతాధికారులు, కళాశాల యాజమాన్యం స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బైక్‌ల చోరీ కేసులో నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కరుణాకర్

కొత్తగూడెంఅర్బన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బైక్‌ల చోరీకి పాల్పడిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. సీఐ కరుణాకర్ కథనం ప్రకారం.. భద్రాచలానికి చెందిన గుమ్మడి రాజు కొంతకాలంగా ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్నాడు. మంగళవారం రాత్రి కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన రాజును అదుపులోకి తీసుకున్నారు. విచారించగా ఖమ్మంలో రెండు, భద్రాద్రి జిల్లాలో ఆరు బైక్‌లు దొంగిలించినట్లు అంగీకరించాడు. 8 వాహనాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా సీఐ కరుణాకర్, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

ఉద్యోగిపై లైంగిక వేధింపుల కేసు నమోదు

కొత్తగూడెం అర్బన్ /కొత్తగూడెంరూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రిలో కాంట్రాక్ట్ సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగిపై బుధవారం లైంగిక వేధింపుల కేసు నమోదైంది. త్రీటౌన్ సీఐ కె.శివప్రసాద్ కథనం ప్రకారం.. శివారెడ్డి అనే వ్యక్తి జిల్లా సర్వజన ఆస్పత్రిలో కాంట్రాక్ట్ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నాడు. అదే ఆస్పత్రిలో మరో మహిళ కూడా సూపర్‌వైజర్‌గా విధులు నిర్వర్తిస్తోంది. శివారెడ్డి తరచూ లైంగిక వేధింపులకు పాల్పడుతుండటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బుధవారం తనను కలవాలని చెప్పాడని, లేకపోతే చంపుతామని బెదిరించాడని ఫిర్యాదులో పేర్కొంది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,413

డ్రెయినేజీ సమస్యకు చెక్

- జిల్లా సర్వజనాస్పత్రిలో ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణం
- రూ.1.5 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభం
- మురుగునీటిని శుద్ధి చేసి చెట్లకు వినియోగించే అవకాశం



జిల్లా సర్వజన ఆస్పత్రి

కొత్తగూడెంరూరల్: ఏళ్లుగా జిల్లా సర్వజన ఆస్పత్రిని డ్రెయినేజీ సమస్య పీడిస్తోంది. ఆస్పత్రి ముందు మురుగు నీరు నిలిచి ఉండటంతో ప్రజలు, ఆస్పత్రి సిబ్బంది ముక్కు మూసుకుని వెళ్తున్నారు. డ్రెయినేజీ పైపులైన్ వేయకుండా చుట్టుపక్కల ఇళ్ల వారు అడ్డుకుంటున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పలుమార్లు పరిశీలించినా సమస్య పరిష్కారం కాలేదు. ఆస్పత్రిలో గతంలో 100 పడకలు ఉండగా, మెడికల్ కళాశాల మంజూరయ్యాక 350 పడకలకు పెంచారు. దీంతో డ్రెయినేజీ సమస్య తీవ్రత కూడా పెరిగింది. ఇంకా పడకల సంఖ్య పెంచాల్సి ఉండగా, మురుగునీటి సమస్య కారణంగా పెంచలేకపోయారు. దీంతో ఆస్పత్రి అధికారులు పలుమార్లు ఉన్నతాధికారులకు విన్నవించగా, ఎట్టకేలకు డ్రెయినేజీ సమస్యకు పరిష్కారం లభించింది.

కాలుష్య నియంత్రణ మండలి నిధులతో...

జిల్లా ఆస్పత్రిలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఎస్టీపీ(మురుగునీటి శుద్ధి ప్లాంట్) ఏర్పాటుకు నిర్ణయించారు. రూ.1.5 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలోనే ప్లాంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపించగా, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నిధులు మంజూరయ్యాయి. రాష్ట్రంలో 20 ఎస్టీపీ ప్లాంట్లు మంజూరు కాగా, వాటిలో జిల్లా సర్వజన ఆస్పత్రి కూడా ఉంది. ఆస్పత్రిలో 2 లక్షల లీటర్లు నిల్వ ఉండే పెద్ద సెప్టిక్ ట్యాంకు నిర్మించనున్నారు. ట్యాంక్‌లో మురుగు నీరు శుద్ధి చేసే యంత్రాలు ఏర్పాటు చేస్తారు. ఆస్పత్రి నుంచి వెలువడే డ్రెయినేజీ నీరు ఆ ట్యాంకులోకి మళ్లిస్తారు. శుద్ధి చేసి బయటకు విడుదల చేశాక, ఆ నీటిని చెట్లకు వినియోగించనున్నారు. తాగడానికి, స్నానానికి మాత్రం వినియోగించరు. హైదరాబాద్‌కు చెందిన సింగస్ ప్రాజెక్ట్ వారు ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. నిర్మాణం పూర్తయ్యాక పదేళ్ల పాటు ప్లాంట్‌ను వారే పర్యవేక్షిస్తారు. ఆరు నెలల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉండగా, డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో ఆస్పత్రి అధికారులు, సిబ్బంది, జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆరు నెలల్లో పూర్తి

ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణం ఆరు నెలల్లో పూర్తవుతుంది. కాలుష్య నియంత్రణ మండలి నిధులతో పనులు జరుగుతున్నాయి. ప్లాంట్ పూర్తయితే డ్రెయినేజీ సమస్య తీరుతుంది. సింగస్ ప్రాజెక్ట్ సంస్థ పనులు చేపడుతోంది. నిర్మాణం పూర్తయ్యాక పదేళ్లపాటు నిర్వహణ బాధ్యత కూడా వారిదే.

– సలీమ్, ఏఈ


నిర్మాణంలో ఉన్న మురుగునీటి శుద్ధి ప్లాంట్

మెరుగైన వైద్య సేవలు

జిల్లా సర్వజన ఆస్పత్రిలో ఎస్టీపీ ప్లాంట్ నిర్మాణం పనులు జరుగుతున్నాయి. దీంతో డ్రెయినేజీ సమస్య తీరనుంది. ఔట్ లైన్ నిర్మాణ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం. నిధులు రాగానే ఐసీయూలో పడకలు, డయాలసిస్ కేంద్రంలో మరో 5 పడకలు పెంచుతాం. ప్రజలకు మెరుగైన వైద్యసేవలందుతాయి.

– రాజ్‌కుమార్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్

నా స్నేహితుడు మరోసారి ‘మహా’ సీఎం!

ఖమ్మంకు చెందిన వ్యాపారి సీతారాంబాబు


దేవేంద్ర ఫడ్నవీస్‌కు జ్ఞాపిక ఇస్తున్న సీతారాంబాబు (ఫైల్)

సాక్షిప్రతినిధి, భద్రాద్రికొత్తగూడెం: నాగపూర్ యూనివర్సిటీ లా కాలేజీలో తన సహచరుడైన దేవేంద్ర ఫడ్నవీస్ మహారాష్ట్ర సీఎంగా మరోమారు ప్రమాణ స్వీకారం చేయనుండటం ఆనందంగా ఉందని ఖమ్మం పట్టణానికి చెందిన వ్యాపారి వేములపల్లి సీతారాంబాబు తెలిపారు. లా కాలేజీ 1990 బ్యాచ్‌లో ఫడ్నవీస్, తాను కలిసి చదువుకున్నామని ఆయన గుర్తు చేశారు. అప్పట్లో ఏబీవీపీలో చురుగ్గా పని చేయడమే కాక కాలేజీ ఎన్నికల్లో అధ్యక్షుడిగా తాను, కార్యదర్శిగా ఫడ్నవీస్ పోటీ చేశామని తెలిపారు. కాలేజీ రోజుల్లో ఐదుగురు స్నేహితులం కలిసి బ్యాచ్‌గా ఉండేవాళ్లమని చెప్పారు. ఆయన తొలిసారి 2015లో సీఎంగా ప్రమాణ స్వీకారం చేసినప్పుడు స్నేహితులను ఇంటికి పిలిచి భోజనం పెట్టారని.. చివరగా 2023లో ఫడ్నవీస్‌ను కలిశానని తెలిపారు. త్వరలో ముంబై వెళ్లి వ్యక్తిగతంగా శుభాకాంక్షలు తెలియజేస్తామని, వచ్చే ఏడాది నవమికి ఆయనను భద్రాచలం తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తానని సీతారాంబాబు వెల్లడించారు.

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం

ఆందోళన చెందుతున్న గిరిజన రైతులు


లింగాలపల్లిలో ధాన్యం కల్లాల వద్ద గిరిజన రైతులు

దమ్మపేట: కల్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు చేయడం లేదని గిరిజన రైతులు ఆరోపించారు. ఈ సందర్భంగా బుధవారం పలువురు రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని లింగాలపల్లికి చెందిన గిరిజన రైతులు వరి కోతలు పూర్తయ్యాక శివారులో ధాన్యం రాశులుగా పోశారు. ధాన్యం ఆరినా గిరిజన సహకార సంస్థ(జీసీసీ) ఆధ్వర్యంలోని కేంద్రం నిర్వాహకులు కొనుగోలు చేయడంలేదు. రెండు, మూడు రోజులుగా మబ్బులు పడుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి కొనుగోళ్లు చేపట్టాలని రైతులు పాయం సూర్యం, ఊకే రామచంద్రయ్య, చాపా ఆనంద్, సోయం వీరాస్వామి, పాయం ఆదినారాయణ, చాపా చలమరావు కోరారు. ఈ విషయమై జీసీసీ మేనేజర్ పాపారావును వివరణ కోరగా.. లింగాలపల్లి గ్రామం గండుగులపల్లి క్లస్టర్ పరిధిలోకి వస్తుందని, అక్కడి కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యమే కొనుగోలు చేసే అధికారం తమకు ఉంటుందని తెలిపారు. రైతుల సౌలభ్యం కోసం క్లస్టర్‌కు దూరంగా ఉన్న గ్రామాల్లోనూ ధాన్యం కొనుగోలు చేస్తే ఏపీ వాసుల నుంచి కొన్నట్లు ఆరోపణలు వచ్చాయన్నారు. దీంతో అధికారులు క్లస్టర్లకు దూర గ్రామాల్లో కొనుగోలు చేయొద్దని ఆదేశించారని వెల్లడించారు. అలాగే, సివిల్ సప్లయీస్ డీటీ ప్రభాకర్‌రావును వివరణ కోసం ఫోన్‌లో ప్రయత్నించగా స్పందించలేదు.

చికిత్స పొందుతున్న కేటీపీఎస్ ఉద్యోగి మృతి

పాల్వంచ: రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న కేటీపీఎస్ ఉద్యోగి బుధవారం మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. కేటీపీఎస్‌లో పీఏగా పనిచేస్తున్న మేకపోతుల శ్రీనివాసరెడ్డి(47) ఈ నెల 2న ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. రామన్నగూడెం వెళ్లిన భార్యకు ఫోన్ ద్వారా పురుగుల మందు తాగినట్లు చెప్పాడు. ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి స్పృహ తప్పిన శ్రీనివాసరెడ్డిని కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉండగా, ఒకరు యూఎస్ఏలో, మరొకరు హైదరాబాద్‌లో ఉన్నారు.

ఆత్మస్థైర్యంతో రాణించాలి

అదనపు కలెక్టర్ విద్యాచందన


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అదనపు కలెక్టర్ విద్యాచందన

సూపర్‌బజార్(కొత్తగూడెం): దివ్యాంగులు ఆత్మస్థైర్యం, పట్టుదలతో రాణించాలని అదనపు కలెక్టర్ విద్యాచందన సూచించారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని విద్యాచందన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. దివ్యాంగుల సంక్షేమానికి ఉపాధి హామీ పథకం ద్వారా ప్రత్యేక జాబ్ కార్డు ఇచ్చి పనిదినాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. మహిళా శిశు వయోవృద్ధుల సంక్షేమ శాఖాధికారి లెనినా మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వం వినికిడి పరికరాలు, ల్యాప్‌టాప్‌లు, ఫోన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ఎకనామికల్ రీహాబిలిటేషన్ పథకం కింద గత రెండేళ్లలో జిల్లాలో ఒక్కొక్కరికీ రూ. 50 వేల చొప్పున 56 మందికి ఆర్థిక సాయం అందించినట్లు చెప్పారు. అనంతరం ఆటల పోటీల విజేతలకు పతకాలు, సర్టిఫికెట్లు అందించారు. దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేసిన సంఘం సభ్యులను, ఉద్యోగులను సన్మానించారు. దివ్యాంగులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో సీపీఓ సంజీవరావు, డీఈఓ వెంకటేశ్వరాచారి, డీపీఆర్వో అజ్గర్ హుస్సేన్ తదితరుల పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను కొట్టిన వ్యక్తికి జరిమానా

కొత్తగూడెంఅర్బన్: డ్యూటీలో ఉన్న పోలీస్ కానిస్టేబుల్ కొట్టిన వ్యక్తికి జరిమానా విధిస్తూ కొత్తగూడెం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ బుధవారం తీర్పు చెప్పారు. వివరాలు ఇలా.. 2023, జూలై 16న కొత్తగూడెం త్రీ టౌన్ కానిస్టేబుల్ కె.వేణుగోపాల్ అర్ధరాత్రి విధులు నిర్వర్తిస్తున్నాడు. కొత్తగూడెం రైల్వే స్టేషన్ వద్ద తనిఖీలు చేపట్టిన పోలీసులు బైక్‌పై వస్తున్న టేకులపల్లికి చెందిన మాలోత్ అశోక్‌ను ఆపి బ్రీత్ అనలైజర్‌లో ఊదమని సూచించారు. అందుకు నిరాకరించిన అశోక్ కానిస్టేబుల్ వేణుగోపాల్‌పై దాడి చేశాడు. దీంతో తలకు, కుడి చేతి చిటికెన వేలుకు గాయాలయ్యాయి. కొత్తగూడెం త్రీ టౌన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టి, చార్జిషీట్ దాఖలు చేశారు. ఎనిమిది మంది సాక్షులను విచారించిన న్యాయమూర్తి మాలోతు అశోక్‌కు రూ.4000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. పీడీపీ లక్ష్మి ప్రాసిక్యూషన్ నిర్వహించగా, కొత్తగూడెం కోర్టు లైజన్ ఆఫీసర్ ఎస్.కె. ఘని, పీసీ బి.రవి సహకరించారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ

రూ.5 లక్షల నగదు, ఆభరణాలు అపహరణ

వైరా: వైరా బ్రాహ్మణపల్లిలో నివాసం ఉంటున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడి ఇంట్లో చోరీ జరిగింది. వైరాలోని ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న షేక్ అఫ్జల్ గత నెల 28న భార్యకు చికిత్స చేయించేందుకు హైదరాబాద్ తీసుకెళ్లారు. బుధవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఉండగా లోపల పరిశీలిస్తే బీరువా తలుపులు కూడా పగులగొట్టి ఉన్నాయి. అందులో భద్రపర్చిన రూ.5 లక్షల నగదు, ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏసీపీ ఎంఏ రెహమాన్, సీఐ నూనావత్ సాగర్, ఎస్ఐ భాగ్యరాజ్‌తో పాటు క్లూస్ టీం సభ్యులు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

గొల్లపూడి పాఠశాలలో మధ్యాహ్న భోజనం బంద్

వైరారూరల్: మండలంలోని గొల్లపూడి ప్రాథమిక పాఠశాలలో రెండు రోజులుగా మధ్యాహ్న భోజనం వండకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల కిందట పాఠశాల హెచ్‌ఎం జాన్, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు సుబ్బలక్ష్మి మధ్య వివాదం నెలకొంది. భోజనం నాణ్యతగా ఉండటం లేదని హెచ్‌ఎం ఆగ్రహం వ్యక్తం చేయడంతో, తాను నాణ్యతా ప్రమాణాలతోనే భోజనం వండుతున్నానని సుబ్బలక్ష్మి బదులిచ్చింది. ఈ వివాదం కారణంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేయలేనని ఆమె చేతులెత్తేయడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈఓ కొత్తపల్లి వెంకటేశ్వర్లును వివరణ కోరగా సమస్య పరిష్కారమైందని తెలిపారు.

న్యాయం చేయాలని యువతి ఆందోళన


ఆందోళన చేస్తున్న యువతి, మహిళా సంఘాల నాయకులు

జూలూరుపాడు: మండల కేంద్రంలో ఓ యువకుడి ఇంటి ఎదుట యువతి ఆందోళన చేపట్టిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. జూలూరుపాడు న్యూకాలనీకి చెందిన వినోద్ అనే యువకుడి ఇంటి ఎదుట పాల్వంచ మండలం పుల్లయ్యగూడేనికి చెందిన యువతి ఆమని మహిళా సంఘాలతో కలిసి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా బాధిత యువతి మాట్లాడుతూ వినోద్ తనను ప్రేమించి, మరొకరిని పెళ్లి చేసుకోవడానికి సిద్ధపడ్డాడని పేర్కొంది. తనకు న్యాయం చేయాలని కోరింది. విషయం పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని ఠాణాలో ఫిర్యాదు చేయాలని సూచించగా ఆందోళన విరమించింది. ఆ తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. కార్యక్రమంలో ఇండియన్ కిసాన్ యూనియన్ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొడెం సీతాకుమారి, జిల్లా నాయకురాలు కె.నిర్మల, దిశ కమిటీ పాల్వంచ మండలం అధ్యక్షురాలు మంజుల, ఉమెన్ రైట్స్ సభ్యులు రేణుక, నాగమణి, పలువురు మహిళలు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌కింద పడి చిన్నారి మృతి


కిరణ్య (ఫైల్)

గుండాల: చేనుకు వస్తానని మారం చేస్తున్న నాలుగేళ్ల చిన్నారిని నానమ్మ తన వెంట తీసుకెళ్లింది. ట్రాక్టర్‌పై కూర్చున్న ఆ చిన్నారి ప్రమాదవశాత్తు ట్రాక్టర్ టైరు కింద పడి మృతి చెందింది. ఈ సంఘటన ఆళ్లపల్లి మండలంలో బుధవారం జరిగింది. ఆళ్లపల్లి మండలం అనంతోగు గ్రామానికి చెందిన గలిగె నరేష్–కృష్ణవేణి దంపతుల కుమార్తె కిరణ్య(4). మొక్కజొన్న బస్తాలు మోసేందుకు నానమ్మ కూలికి వెళ్తుండగా చిన్నారి మారం చేసింది. దీంతో ఆమె చిన్నారిని వెంట తీసుకెళ్లింది. చేనులో కూలీలంతా బస్తాలను ట్రాక్టర్‌లో వేసి ఒక చోటకు చేర్చుతున్నారు. అప్పటి వరకు ట్రాక్టర్ ఇంజన్‌పై కూర్చున్న ఆ చిన్నారి ప్రమాదవశాత్తు కిందపడింది. దీంతో ట్రాక్టర్ టైరు తలపై ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బాలిక మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

రోడ్డు ప్రమాదంలో యువకుడు...


సందీప్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని లచ్చగూడెం గ్రామానికి చెందిన పినబోయిన సందీప్ (28) ఉపాధి కోసం ఏడాది క్రితం హైదరాబాద్ వెళ్లాడు. జీహెచ్ఎంసీ పరిధిలోని మేడ్చల్ ప్రాంతంలో డ్రైవర్‌గా విధుల్లో చేరాడు. బుధవారం చెత్త డంప్ చేసేందుకు ఫ్లైఓవర్ మీదుగా వాహనం నడుపుకుంటూ వెళుతుండగా వాహనం అదుపుతప్పి ఫ్లైఓవర్ పైనుంచి కింద పడిపోయింది. ఈ ప్రమాదంలో సందీప్ వాహనంలోనే ఇరుక్కుపోయాడు. వాహనం నుంచి మంటలు చెలరేగి సజీవదహనమయ్యాడు. మృతదేహాన్ని బుధవారం రాత్రి స్వగ్రామం లచ్చగూడెం తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

పోక్సో కేసులో యువకుడు అరెస్ట్

అశ్వాపురం: మండల పరిధిలోని రామచంద్రాపురం గ్రామానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు సీఐ అశోక్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటనలో అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు.

డీజే వాహనం, బైక్ ఢీ : ఇద్దరికి గాయాలు

జూలూరుపాడు: మండల పరిధిలోని రామచంద్రాపురం–అనంతారం గ్రామాల మధ్య బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. చండ్రుగొండ మండలం పోకలగూడెం గ్రామానికి చెందిన యువకులు బానోత్ రవి, ధరావత్ రత్న బైక్‌పై జూలూరుపాడు నుంచి పురుగుల మందులు తీసుకుని ఇంటికి వెళ్తున్నారు. అదే సమయంలో చండ్రుగొండ వైపు నుంచి డీజే బాక్స్‌లతో ట్రాలీ వాహనం జూలూరుపాడు వైపు వస్తోంది. ఈ క్రమంలో రామచంద్రపురం దాటాక రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మరో ఘటనలో యువకుడికి..

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. పడమటనర్సాపురం డబుల్‌బెడ్రూం ఇళ్ల సముదాయం నుంచి బూరుగు ముత్యాలరావు అనే యువకుడు బైక్‌పై గ్రామంలోకి వెళుతున్నాడు. అదేసమయంలో కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న కారు పడమటనర్సాపురం వద్ద బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ముత్యాలరావు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానికులు 108 వాహనంలో కొత్తగూడెంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

గంజాయి స్వాధీనం


దుమ్ముగూడెం: ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న కారు


టేకులపల్లి: వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం: ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం గంజాయి స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం వైపుగా వేగంగా వస్తున్న కారును గమనించి అధికారులు వెంబడించారు. లక్ష్మీనగరం వద్ద పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని భద్రాచలం తరలించారు. కారు బానెట్‌లో 4 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కాగా కారులో ఉన్న మరో ముగ్గురు నిందితులు పరారయ్యారు.

టేకులపల్లిలో 8 కేజీలు..

టేకులపల్లి: మండలంలోని రోళ్లపాడు క్రాస్ రోడ్ వద్ద వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు కారులో తరలిస్తున్న 8 కేజీల గంజాయిని బుధవారం పట్టుకున్నారు. కారులో ఇద్దరు వ్యక్తులు ఉండగా, పాలకుర్తి నివాసి నలిమల వినోద్ పారిపోయాడు. మరో వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా సిద్దిపేట జిల్లాకు చెందిన బానోత్ గణేష్‌గా తేలింది. ఒడిశాలోని కలిమెల నుంచి సిద్దిపేటకు గంజాయిని తరలిస్తున్నట్లు అంగీకరించాడు. మూడు సెల్ ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సుంకర రమేష్, ఇల్లెందు సీఐ బి. రామ్‌ప్రసాద్, ఎస్ఐ అచ్చారావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా: కూలీలకు తీవ్ర గాయాలు


క్షతగాత్రులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ

అశ్వారావుపేటరూరల్: కూలీలను తరలిస్తున్న ఓ ఆటో అదుపుతప్పి బోల్తాపడగా, 11 మందికి గాయాలయ్యాయి. స్థానికులు, బాధితుల కథనం ప్రకారం.. మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన 11 మంది వ్యవసాయ కూలీలు బుధవారం ఆటోలో దమ్మపేట మండలం మల్కారం గ్రామంలో కూలి పనులకు వెళ్తున్నారు. ఈక్రమంలో అశ్వారావుపేట మండలం తిమ్మాపురం సమీపంలో కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో ఆటోలో ఉన్న కె.లక్ష్మి, వి.చంటిబాబు, కె.రాము, ఈ.చిలకమ్మ, బి.దేవికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం సత్తుపల్లి, కొత్తగూడెం ఆస్పత్రులకు తరలించారు. స్వల్పంగా గాయపడిన మరో ఆరుగురికి స్థానిక ఆస్పత్రిలో వైద్యులు చికిత్స చేస్తున్నారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ప్రభుత్వ ఆస్పత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, తుమ్మా రాంబాబు, ఎస్.వీరభద్రరావు ఉన్నారు.